రవాణా శాఖ మంత్రిది అవగాహన రాహిత్యం

మారేడ్‌పల్లి, నవంబర్ 17: రాష్ట్ర రవాణాశాఖ మంత్రి అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని, కంటోన్మెంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు విడుదల కాలేదని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ అన్నారు. ఆదివారం మహీంద్రాహిల్స్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలివేటెడ్ కారిడార్ల కోసం అప్పగించిన కంటోన్మెంట్ భూముల పరిహారం విషయంలో ప్రజలను మంత్రి తప్పు దోవ పట్టిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.3.23 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వ కన్సాలిడేటెడ్ ఫండ్‌లో జమ చేయలేదని విమర్శించారు.

ఫిలిం ఫెస్టివల్

కార్యక్రమంలో పాల్గొన్న వినయ్‌కుమార్, రామచంద్రారెడ్డి

చిక్కడపల్లి, నవంబర్ 17: ఇండియన్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ నిర్వహిస్తున్న విశాఖ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్-2024లో భాగంగా పోటీలో ఉన్న చిత్రాలను బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రదర్శించారు. అనంతరం విజేతలను ప్రకటించారు. ఈ సందర్భంగా ఇండియన్ ఫిలిం మేకర్స్ అసోసియేసన్ ప్రధాన కార్యదర్శి పులగం రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఉత్తమచిత్రం సహస్ర, ఉత్తమ స్క్రీన్‌ప్లే తనికెళ్ల భరణి (డెడ్ ఎండ్), ఉత్తమ దర్శకుడు కె.శివ తేజ (క్యూ సెరాసెర), ఉత్తమ డాక్యుమెంటరీ చిత్రం (పొట్టి శ్రీరాములు), ఉత్తమ నటుడు బీడీఎల్ సత్యనారాయణ (సాగరవాసి) ఉత్తమ సహాయ నటి విజయదుర్గ (కొత్త జీవితం) విజేతలుగా నిలిచారని అన్నారు. మరిన్ని మంచి చిత్రాలు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఇ.దాశరథి ఫిలిం సొసైటీ అధ్యక్షుడు వినయ్‌కుమార్, సొసైటీ కార్యదర్శి ఎల్.సత్యనారాయణ, హిందీ చిత్ర దర్శకుడు కపిల్ జోన్ ధాలే, హెచ్‌ఆర్ దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు వరంగా గ్రంథాలయాలు

- ఎస్‌ఆర్‌నగర్ గ్రంథపాలకుడు హరిబాబు
- అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వ చొరవే కారణం

ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను సన్మానిస్తున్న ఎస్‌ఆర్ నగర్ గ్రంథపాలకుడు హరిబాబు

అమీర్‌పేట్,నవంబర్ 17: దశాబ్ద కాలంలో ఆధునీకరించబడిన గ్రంథాలయాలు నిరుద్యోగులకు వరంగా మారాయి. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచాలన్న నిరుద్యోగుల డిమాండ్ మేరకు అప్పటి బీఆర్‌ఎస్ సర్కార్ అనుకూల నిర్ణయం తీసుకున్నది. దీంతో దశాబ్ద కాలంలో గ్రంథాలయాలకు పాఠకుల సంఖ్య పెరగడం, అంతకంతకూ సదుపాయాలు కూడా మెరుగుపడడంతో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు నిరుద్యోగులు రోజుకు కనీసం 8 గంటల పాటు లైబ్రరీల్లోనే గడిపే చక్కటి అవకాశం అందుబాటులోకి వచ్చింది. ఇటువంటి సదుపాయాలే శాఖ గ్రంథాలయం ఎస్‌ఆర్‌నగర్‌లో కూడా ఉన్నాయి.

ఎస్‌ఆర్‌నగర్ గ్రంథపాలకుడు హరిబాబు చొరవతో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి అందుబాటులో ఉండేలా ఇప్పటివరకు సుమారు వెయ్యి నుంచి 1200 పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను అందుబాటులోకి తెచ్చారు. ఎస్‌ఆర్‌నగర్ జలమండలి కార్యాలయం సమీపంలోని ఓ విశాలమైన పార్కులో ఉన్న ఈ గ్రంథాలయం నిరుద్యోగులకు వ్యక్తిగత, గ్రూప్ స్టడీకి అనువైన వాతావరణం కల్పిస్తున్నది. దీంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2023 జూలైలో గ్రూప్-4 నోటిఫికేషన్ ఇవ్వడంతో.. తెలంగాణ నలు మూలల నుంచి నగరానికి వచ్చిన ఎందరో నిరుద్యోగులు ఎస్‌ఆర్‌నగర్ గ్రంథాలయాన్ని తమ చదువులకు వేదికగా ఎంచుకొని విజయం సాధించారు. నవంబర్ 14న వెలువడిన ఫలితాల్లో పలువురు ఉద్యోగాలు పొందారు. వీరిలో ఓయూలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం పొందిన శేఖర్, మహబూబాబాద్, సిద్ధిపేట, సూర్యాపేట పురపాలక కార్యాలయాల్లో వార్డు ఆఫీసర్లుగా పృథ్వీ, శివ, వంశీకృష్ణారెడ్డి, జూనియర్ ఆడిటర్‌గా శివకుమార్ ఎంపికయ్యారు. శనివారం గ్రంథాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో గ్రంథపాలకుడు హరిబాబు వారిని ఘనంగా సన్మానించారు.

గ్రంథపాలకుడి సహకారం మరువలేనిది

పని దినాల్లోనేకాకుండా సెలవు రోజుల్లో కూడా ఎస్‌ఆర్‌నగర్ గ్రంథాలయాన్ని నిరుద్యోగుల కోసం తెరిచి ఉంచేలా గ్రంథపాలకుడు హరిబాబు చొరవ తీసుకున్నారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు తాము ఇక్కడే గడపాల్సిన పరిస్థితుల్లో ఎక్కడా ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులను అందుబాటులోకి తెచ్చారు. 2022 నుంచి రెగ్యులర్‌గా వస్తున్న తమ లాంటి ఎంతో మంది నిరుద్యోగులకు గ్రంథపాలకుడు పూర్తి సహాయ సహకారాలు అందించేవారు. ఇక్కడి గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలు, ఇక్కడ నెలకొన్న వసతులు, చదువుల్లో ఎక్కడా తమ ఏకాగ్రతకు భంగం కలుగకుండా చక్కగా చదువుకుని ఉద్యోగాలు సాధించేందుకు దోహదం చేశాయి.

– శేఖర్, ఓయూలో జూనియర్ అసిస్టెంట్

యూపీఎస్సీ కూడా సిద్ధం కావొచ్చు..

పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలన్నీ ఇక్కడి గ్రంథాలయంలో అందుబాటులో ఉండడం విశేషం. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తో పాటు యూపీఎస్సీ పరీక్షలకు కూడా సిద్ధమయ్యేందుకు అవసరమైన రివైజ్డ్ ఎడిషన్ తెలుగు, ఇంగ్లిష్ మీడియం పుస్తకాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. 2022 నుంచి ఎస్‌ఆర్‌నగర్ గ్రంథాలయానికి రెగ్యులర్‌గా వచ్చి ఇక్కడే పరీక్షలకు సిద్ధమవుతున్నాను. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 వరకు ఇక్కడే చదువుకుంటున్నా.. ఎక్కడా ఏకాగ్రతకు భంగం కలిగి ఇబ్బందులు ఇక్కడ లేవు. గ్రంథపాలకుడు ఇక్కడ తమకు అవసరమైన అన్ని పుస్తకాలను అందుబాటులోకి తెచ్చేందుకు ఎంతో చొరవ తీసుకున్నారు.

– శివకుమార్, జూనియర్ ఆడిటర్

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి, నవంబర్ 17: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గాంధీనగర్ డివిజన్‌లోని సిద్ధంశెట్టి అపార్ట్‌మెంట్ ఆవరణలోని బంగారు పోచమ్మ దేవాలయంలో కార్తికమాసం సందర్భంగా ఆదివారం పూజా కార్యక్రమాలు, వనభోజనాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆలయంలో పూజలు నిర్వహించారు. అపార్ట్‌మెంట్‌కు చెందిన భక్తులు కొందరు అమ్మవారి కోసం చేయించిన బంగారు, వెండి ఆభరణాలు ఎమ్మెల్యే చేతుల మీదుగా అమ్మవారికి సమ్పరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భక్తి భావనతోనే మనతోపాటు కుటుంబం అంతా ప్రశాతంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహ, సీనియర్ నాయకుడు ముఠా నరేశ్, పార్టీ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు రాకేశ్‌కుమార్, అసోసియేషన్ అధ్యక్షుడు రామారావు, కార్యదర్శి మూర్తి, జితేందర్, లక్ష్మి, మణి, పద్మ, ప్రసన్న పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే ముఠా గోపాల్ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఏడుగురు లబ్ధిదారులకు అందజేశారు. గాంధీనగర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రాకేశ్ కుమార్, రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్, మీడియా ఇన్‌చార్జి ముచ్చ కుర్తి ప్రభాకర్, నాయకులు పున్న సత్యనారాయణ, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, ముదిగొండ మరళి, ఎర్రం శేఖర్, ఎస్టీ ప్రేమ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సామర్థ్యం పెంపులో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్లు, అధ్యాపకులు

చిక్కడపల్లి, నవంబర్ 17: విద్యార్థుల సామర్థ్యాలను వెలికితీయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పలువురు ప్రొఫెసర్లు పేర్కొన్నారు. బాగ్‌లింగంపల్లి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాలలో ఐదు రోజుల పాటు నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రొగ్రామ్(ఎఫ్‌డీపీ) ఆదివారం ముగిసింది. ఉస్మానియా యునిర్సిటీ ప్రొఫెసర్ జయవెంకటేశ్వర్ మాట్లాడుతూ.. టీచింగ్ మెథడాలజీలో అధునిక పద్ధతులను వివరించారు. ప్రొఫెసర్ ప్యాట్రిక్ మాక్స్ మాస్ పలు సూచనలు చేశారు. భవన్స్ కళాశాల కామర్స్ విభాగాధిపతి ఎల్ఎస్ కమల మాట్లాడుతూ.. ఫ్యాకల్టీ అభివృద్ధిలో కంటెంట్ పరిజ్ఞానం టీచింగ్ అండ్ లెర్నింగ్ స్కిల్స్ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా అధ్యాపకులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావాలన్నారు. విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలన్నారు. కార్యక్రమంలో ఓయూ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ ఇంద్రకంటి శంకర్, కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఫ్యాకల్టీలు పాల్గొన్నారు.

బ్రాహ్మణ ఉద్యోగుల కార్తిక సమ్మేళనం

హెచ్‌ఎంటీ బ్రాహ్మణ ఉద్యోగుల సమ్మేళనంలో పాల్గొన్న ఉద్యోగులు

బన్సీలాల్‌పేట్, నవంబర్ 17: పద్మారావు నగర్‌లోని కొత్త కామకోటి కల్యాణ నిలయం ఆవరణలో హెచ్‌ఎంటీ సంస్థ బ్రాహ్మణ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కార్తిక మాసం సందర్భంగా ఆదివారం వన మహోత్సవం నిర్వహించారు. శివుడికి ఏకాదశ రుద్రాభికం, అమ్మవారికి లలిత సహస్ర నామం, కుంకుమ పూజ నిర్వహించారు. ఐకమత్యం, సోదరభావం పెంపొందించడానికి 40 ఏండ్లుగా ప్రతి ఏటా వన మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కేఎస్‌ఆర్ మూర్తి తెలిపారు. ముఖ్య అతిథిగా ఎస్వీ సుబ్రమణ్యం హాజరయ్యారు. సంస్థ ప్రతినిధులు పుచ్చా ప్రసాద్, మధుసూదన్‌రావు, సాయిప్రసాద్, రాందాస్, బాలభాస్కర్, లక్ష్మిప్రసాద్, మనోహర్, కవిరాజ్, మాజీ, ప్రస్తుత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. సంస్థకు చేయూతనిస్తున్న పలువురు దాతలను సన్మానించారు. చిన్నారులకు బహుమతులను అందజేశారు.

హోలీ ఫ్యామిలీ చర్చిలో ప్రార్థనలు

తిరుమలగిరి హోలీ ఫ్యామిలీ చర్చిలో ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ను సత్కరిస్తున్న కార్డినల్ పూల ఆంథోని, చర్చి ఫాదర్ మారెడ్డి తదితరులు

బొల్లారం, నవంబర్ 17: కంటోన్మెంట్ ఏడో వార్డు తిరుమలగిరి హోలీ ఫ్యామిలీ చర్చిలో ఆదివారం ది ఫస్ట్ హోలీ కమ్యూయన్ కార్యక్రమంలో కార్డినల్ పూల ఆంథోనితో కలిసి ఎమ్మెల్యే శ్రీగణేశ్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ లీడర్ మురళీముదిరాజ్, చర్చి ఇన్‌చార్జి కోమారెడ్డి, మారెడ్డి, కాథలిక్ అసోసియేషన్ హైదరాబాద్ ప్రెసిడెంట్ జాన్ బాస్కో, మైనార్టీ సెల్ చైర్మన్ శ్యామ్‌సన్ సూర్యకాంత్, ఆంథోని జోసఫ్, మైఖేల్, రేమండ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు 662 సైకిళ్ల పంపిణీకి ఏర్పాట్లు

సైకిళ్లను క్లబ్ ప్రతినిధులకు అందజేస్తున్న రోటరీ గవర్నర్ రొటేరియన్ కె.శరత్‌చౌదరి

అమీర్‌పేట్, నవంబర్ 17: రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నార్త్ (రోటరీ డిస్ట్రిక్ట్ 3150) ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ పరిధిలోని తాము చదువుకుంటున్న ప్రభుత్వ పాఠశాలలకు దూరంగా ఉంటున్న కాలి నడక, ఇతర పద్ధతుల ద్వారా పాఠశాలలకు చేరుకుంటున్న 662 మందిని ఎంపిక చేసి వారికి సైకిళ్ల అందజేసే కార్యక్రమం బేగంపేట్‌లోని హోటల్ హరిత ప్లాజాలో ఆదివారం జరిగింది. రోటరీ డిస్ట్రిక్ట్ 3150 పరిధిలో రాష్ట్రంతో పాటు ఏపీలోని గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో 542 సైకిళ్లు, రోటరీ డిస్ట్రిక్ట్ 3040 పరిధిలోని ఇండోర్, భోపాల్‌లో 120 మంది బాలికలకు పంపిణీ చేస్తారు. క్లబ్ గవర్నర్ రొటేరియన్ కె.శరత్ చౌదరి ముఖ్యఅతిథిగా విచ్చేశారు.

కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ శరత్ చౌదరి, డిస్ట్రిక్ట్ డిప్యూటీ గవర్నర్ శైలేష్ గుమ్మిడెల్లి, అసిస్టెంట్ గవర్నర్ మోహన వంశీతో పాటు రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నార్త్ అధ్యక్షుడు బీఆర్వీ సుశీల్‌కుమార్, క్లబ్ కోశాధికారి నరేశ్‌రమన్, కార్యదర్శి డాక్టర్ వెంకట మురళి, రొటేరియన్లు హరిహరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అన్నదానం

అన్నదానం చేస్తున్న డాక్టర్ ఆనంద్

సైదాబాద్, నవంబర్ 17: నగరంలోని అనాథశ్రమంలో డాక్టర్ ఆనంద్, హరిప్రియ ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బంజారా మహిళా సొసైటీ సుజాత, డాక్టర్ పూర్ణిమ ఆధ్వర్యంలో మలక్‌పేటలోని ఫిన్ బధిరుల ఆశ్రమంలో చిన్నారులకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో బంజారా మహిళా సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

30న జరిగే సదస్సును విజయవంతం చేయాలి

హిమాయత్‌నగర్, నవంబర్ 17: ఎస్సీ వర్గీకరణ, క్రీమిలేయర్‌ను వ్యతిరేకిస్తూ ఈనెల 30న బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగే రాష్ట్ర స్థాయి సదస్సుకు మాలలు అధిక సంఖ్యల్లో తరలివచ్చి విజయవంతం చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు వీఎల్ రాజు పిలుపునిచ్చారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ, క్రీమిలేయర్‌ను అమ లుతో దళితులకు తీరని అన్యాయం జరగడంతో పాటు విద్య,ఉద్యోగ అవకాశాలను కోల్పోయే అవకాశం ఉందన్నారు. పజల సమస్యలను పట్టించుకోకుండా కాంగ్రెస్ ప్రభు త్వం రాజకీయ డ్రామాలను ఆడుతుందని విమర్శించారు. సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జె.ఎన్.రావు, జాతీయ ఉపాధ్యక్షుడు భాస్కర్‌రావు,సుప్రీంకోర్టు న్యాయవాది కృష్ణ స్వరూప్, ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.అశోక్ పాల్గొన్నారు.

వచ్చేనెల 1న మాలల సభ

కందుకూరు: నగరంలో మాలల బహిరంగ సభను డిసెంబర్ 1న నిర్వహించి మాలల సత్తాను చాటుతామని మాలల ఐక్యవేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్ తెలిపారు. మండలకేంద్రంలో ఆదివారం మండల మాల సంఘాల కన్వీనర్ గాదె కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. మాలలు సత్తా చాటాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

సజావుగా గ్రూప్-3 పరీక్షలు

సికింద్రాబాద్ పీజీ కళాశాలలో గ్రూప్-3 పరీక్ష రాసేందుకు వస్తున్న అభ్యర్థులు, తనిఖీ చేస్తున్న పోలీసులు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, నవంబర్ 17: టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ ఆజామాబాద్ డివిజన్ 11కేవీ తిలక్‌నగర్, గోల్నాక, ప్లేగ్రౌండ్, రెడ్ బిల్డింగ్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆజామాబాద్ డివిజన్ ఏడీఈ జి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు తిలక్‌నగర్, గోల్నాక ఫీడర్ పధిలోని తిలక్‌నగర్, ఛే నంబర్ క్రాస్‌రోడ్, అంబర్‌పేట్ మొయిన్ రోడ్, జైస్వాల్ గార్డెన్, మారుతీనగర్, తిరుమలనగర్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు ప్లేగ్రౌండ్ ఫీడర్ పరిధిలోని బురుజు గల్లీ, కుమ్మరివాడి, ఎరుకలబస్తీ, గాంధీవిగ్రహం, వాణి ఫొటో స్టూడియో పరిసరాల్లో.. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు రెడ్ బిల్డింగ్ ఫీడర్ పధిలోని న్యూవినాయకనగర్, ఇండియన్ పెట్రోల్ బంక్, రామంతాపూర్ పాలిటెక్నిక్ కాలేజీ, మల్లికార్జునగర్, ఎరుకల బస్తీ, రామక్రిష్ణనగర్ పరిసరా ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదు.

లష్కర్‌లో..

బేగంపేట : విద్యుత్ లైన్లలో తలెత్తిన సాంకేతిక లోపాలు, ట్రిమ్మింగ్ కారణంగా సోమవారం సికింద్రాబాద్ ప్యారడైజ్ ఏఈడీ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు సంబంధిత అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణానగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కృష్ణానగర్, బాపుబాగ్‌కాలనీ, గ్రీన్‌గేట్, ప్రశాంత్ అపార్ట్‌మెంట్, హరినివాస్ హనుమాన్ ఆలయం ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తారు. అదేవిధంగా బాపుబాగ్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కృష్ణానగర్, సిద్ధివినాయక, పీజీ రోడ్డు పుడ్ వరల్డ్, సింధికాలనీ, మారుతి కన్‌స్ట్రక్షన్, సయ్యద్ అబ్దుల్లా ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

జంగన్నగౌడ్‌కు పాన్ ఇండియన్ నేషనల్ అవార్డు

జంగన్నగౌడ్‌కు అవార్డును ప్రదానం చేస్తున్న ప్రముఖులు

చిక్కడపల్లి, నవంబర్ 17: సామాజిక సేవకుడు గడ్డమీది జంగన్నగౌడ్‌కు పాన్ ఇండియన్ నేషనల్ అవార్డు దక్కింది. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, గజల్ శ్రీనివాస్, తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాల్ కృష్ణ, అవార్డు ఆర్గనైజేషన్ అధ్యక్షుడు అద్దంకి రాజు తదితరులు ఆయనకు అవార్డును ప్రదానం చేశారు.

వెరికోస్ వెయిన్స్‌ను నిర్లక్ష్యం చేయొద్దు..

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అజయ్ బి.మోసూర్

చిక్కడపల్లి, నవంబర్ 17: కాళ్ల వెనుక భాగంలో ఉబ్బిన రక్తనాళాలను (వెరికోస్ వెయిన్స్) నిర్లక్ష్యం చేయవద్దని ప్రముఖ వస్కులర్ సర్జన్, డయాబెటిక్ పుడ్ స్పెషలిస్ట్ డాక్టర్ అజయ్ బి.మోసూర్ అన్నారు. జవహర్‌నగర్‌లోని కేఎం క్లీనిక్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురుకి వైద్య పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కేఎల్ జానకి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం.. : కార్పొరేటర్

గాంధీనగర్ కార్పొరేటర్ పావనికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

చిక్కడపల్లి, నవంబర్ 17: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారిస్తామని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని అన్నారు. గాంధీనగర్ డివిజన్‌లోని ఎస్‌బీహెచ్ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఆదివారం కార్పొరేటర్ పావనికి ఆ కాలనీవాసులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అన్ని విధాలుగా చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఏ. వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, నాయకులు శ్రీకాంత్, ఉమేశ్, సురేందర్, సురేశ్, సాయి కుమార్, రవి యాదవ్, జ్ఞానేశ్వర్, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

చదువుతో పాటు ఆధ్యాత్మిక చింతన ఉండాలి

- జీఎంఆర్ చిన్మయ విద్యాలయ ఆచార్యులు బ్రహ్మచారి విముక్త చైతన్య

జీఎంఆర్ చిన్మయ విద్యాలయ ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి భగవద్గీత పారాయణ పోటీల్లో పాల్గొని విజయం సాధించిన విద్యార్థులు. చిత్రంలో విద్యాలయ ఆచార్యులు బ్రహ్మచారి విముక్త చైతన్య, విద్యాలయ ప్రిన్సిపాల్ ఆర్.సుమతి

సిటీబ్యూరో, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ): విద్యార్థులకు చదువుతో పాటు ఆధ్యాత్మిక చింతన కూడా ఎంతో అవసరమని జీఎంఆర్ చిన్మయ విద్యాలయ ఆచార్యులు బ్రహ్మచారి విముక్త చైతన్య అన్నారు. చిన్మయ మిషన్ మార్గదర్శకాలతో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లోని జీఎంఆర్ చిన్మయ విద్యాలయ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి భగవద్గీత పారాయణ పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆచార్య బ్రహ్మచారి విముక్త చైతన్య మాట్లాడుతూ.. ప్రస్తుతం సమాజంలో నేరాలు, ఘోరాలు, పాశ్చ్యాత్య విష సంస్కృతి పెరిగిపోతున్నాయని, వీటి ప్రభావం భావిత రాలపై పడకుండా ఉండాలంటే విద్యార్థులకు చిన్ననాటి నుంచే ఆధ్యాత్మిక చింతన అలవాటు చేయాలన్నారు. విద్యాలయ ప్రిన్సిపాల్ ఆర్.సుమతి మాట్లాడుతూ చిన్మయ మిషన్ మార్గదర్శకాల మేరకు నిర్వహించిన భగవద్గీత పారాయణ పోటీలలో రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా మొత్తం 140మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో మొదటి స్థానం సాధించిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హులని, జీఎంఆర్ చిన్మయ విద్యాలయ నుంచి 5వ తరగతి విద్యార్థి శ్రవంత్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వెల్లడించారు.

గోవుల సంరక్షణకు రోజుకో రూపాయి పొదుపు చేయాలి

సుల్తాన్‌బజార్, నవంబర్ 17 : గో మాతల సంరక్షణ కోసం ప్రతి రోజు ఒక్క రూపాయి ఆదా చేసేందుకు లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ ఎంతో ఉత్సాహంగా ప్రచారం చేస్తుందని ఫౌండేషన్ చైర్మన్ జస్మత్ పటేల్, ట్రస్టీ రిథేశ్ జాగిర్దార్ అన్నారు. ఆదివారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను వారు పలు గో సంఘాల ప్రతినిధులతో మర్యాద పూర్వకంగా కలిసి గోమాత విగ్రహాన్ని, లవ్ ఫర్ కౌ జ్ఞాపికను అంద జేసి సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నిత్యం ఒక్క రూపాయిని పొదుపు చేస్తే నెల 30 రూపాయలు,సంవత్సరానికి 365 రూపాయలు వస్తుందని అన్నారు. ఈ డబ్బును పొదుపు చేయడం ద్వారా గోమాత సేవలకు సహకరించవచ్చని, భవిష్యత్ తరాలకు గో మాతలను సంరక్షించే విషయాలను వారు గవర్నర్‌కు వివరించారు. సానుకూలంగా స్పందించిన గవర్నర్ మాట్లాడుతూ.. జంతు సంక్షేమ సంఘాలు, గో సేవా సంఘాలు చేస్తున్న కార్యక్రమాలు అత్యద్భుతమని అన్నారు. గోశాలలకు తన వంతు సహాయం చేస్తానన్నారు. కార్యక్రమంలో జస్రాజ్ శ్రీశ్రీమల్, మురళీమనోహర్ పాలోడ్ తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు ప్రాథమిక చికిత్స

బన్సీలాల్‌పేట్, నవంబర్ 17: నగరంలోని రోడ్ల పక్కన, పుట్‌పాత్‌లపై ఉంటున్న వృద్ధులు, నిరాశ్రయులు, దివ్యాంగులకు భోజనం సమకూర్చామని పద్మారావునగర్‌లోని సైకి ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై.సంజీవ్ కుమార్, ఉపాధ్యక్షురాలు ఓ.పావని తెలిపారు. కొందరికి గాయాలవడంతో ప్రాథమిక చికిత్స చేసి మందులను కూడా అందజేసినట్లు పేర్కొన్నారు.

కారు ఢీకొని మహిళ మృతి

బొల్లారం, నవంబర్ 17: కారు ఢీకొని మహిళ మృతి చెందింది. ఈ ఘటన ఆదివారం తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై ఆంథోనమ్మ కథనం ప్రకారం.. రసూల్‌పురకు చెందిన మారుతి కారు డ్రైవర్. తన కారులో తిరుమలగిరి నుంచి బొల్లారం వెళ్తున్నాడు. లోతుకుంటలోని ఓ ఫంక్షన్ హాల్ వద్ద రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని మహిళ (50)ను కారు ఢీకొట్టగా.. తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు గాంధీ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. మరో ఇద్దరు వాహనదారులకు కూడా గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేపట్టారు.